# ప్రథమస్పర్శ

గోపరాజు రామారావు

ప్రకాశరావును 'పెళ్ళిచేసుకోరా' అంటేమండి పడతాడు. వివాహం విషయంలో అతనెందుకు విముఖత చూపుతున్నాడో. దానిలోగల 'అంతరార్థ' మేమిటో, కాంతమ్మగారికి బోధపడలేదు. ఎప్పుడు చూచినా పుస్తకాన్ని అంటిపెటుకొని అగదిలో పడివుంటాడెందుకో? పదహారేండ్ల పడుచుపిల్ల కంటిముందు మెదుల్తా ఉంటే చూస్తూ అతడెలా ఊరుకొంటున్నాడో? అయినా అతనికిలేని దుగ్ధతనకెందుకు? పెళ్ళిచేసుకోవాలని భార్యతో సుఖంగా కాపురంచెయ్యాలని ఉతపికుండాలిగాని తనెంత యిదిగా పోరుతే మాత్రం ప్రయోజనం ఏమిటి? తనకూతురు ఏమైనా అనాకారి అయితేగా: పదహారేండ్ల వయస్సు, నిగనిగలాడే యవ్వనం, చిదిమితే పాలు గారే ఆలేత బుగ్గలు, ఈ వర్ణనలన్నీ ఎందుకు, దేవలోకంనుంచి దిగివచ్చిన అపురూపసౌందర్యవతి తన 'సుగుణ' ఈనాడు ప్రకాశరావు సుగుణని పెండ్లాడకపోయినా ఇబ్బందిలేదు. వేలకువేలు కట్నం ఇస్తానంటే వద్దనే వాజమ్మ ఎవడు? అయిదువేల రూపాయల కట్నంతో వచ్చే అపురూప సుందరిని దక్కించుకోలేక పోతున్నాడు ప్రకాశం. అదొక్కటే తనకు విచారం. తనకూతురికి ఈయనగారికంటే మంచివరుడు దొరకడనా! ఏదో మేనల్లుడని, దిక్కులేనివాడని తరతరాలుగా వస్తున్న సంబంధ బాంధవ్యాల్ని తెగతెంపులు చేసుకోవటం తన కిష్టంలేక, పరాయివాడికే అస్తిఅంతా కట్టిబెట్టటం ఎందుకనిగానీ - లేకపోతే ఈపాటికి సుగుణ పెళ్ళి చేసేసేదే. కోఅంటేకోటి మంది వచ్చివడ్తారని తనకూ తెలుసు అని తనలో తాను అనుకొంటోంది కాంతమ్మగారు పొయ్యిలోకి పుల్లలు ఎగదోస్తూ.

''అత్తయ్యా వంట అయ్యిందా" అంటూ వచ్చాడక్కడికి ప్రకాశం.

"కాసేపాగాలి" అంది రగుల్కొనే మంటల్ని చూస్తో.

"సరే మేడ మీద ఉంటా, పూర్తికాగానేపిలు" అంటూ మేడ ఎక్కాడు ప్రకాశం.

మళ్ళి ఆలోచనల్లో మునిగిపోయింది, ఇరవైనాలుగు గంటలూ తనకల్లుడి ధ్యాసే. ఎప్పుడూ తను అతని భవిష్యత్తుగురించే ఆలోచిస్తూ ఉంటుంది. అతనైతే పరాయి వాడిలాగా, ఏమీ పట్టించుకోకుండా తిరుగుతున్నాడు కానీ— తనావిధంగా ఉండగలదా? తనభర్తచనిపోతూ "పెద్దదిక్కులేకపోతే వాడు చెడిపోతాడు. అదుపాజ్ఞల్లో పెట్టటానికి తల్లితండ్రులు లేరాయె. వాడికి తల్లిపైనా, తండ్రిపైనా, మేనత్తపైనావీవే కనుక కాస్త ఆదరంతో చూస్తూ ఉండు. ఈ ఏడుతో వాడు స్కూలుఫైనల్ పూర్తిచేస్తాడు. కాలేజిచదువుకు వెళ్తానంటే డబ్బు ఖర్చు అవుతుందని వెనుకాడకుండా పెద్దచదువు చెప్పించి సుగుణనిచ్చి పెండ్లిచేసి వాణ్ణి ఇంటివాణ్ణిచెయ్యి'' అనిచెప్పిపోయారాయన. అమాటనే ఆధారం చేసుకొని సుగుణతో సమానంగా ఆదరించేది ప్రకాశాన్ని. అసలు అతని ఉద్దేశ్యమేమిటో? పెళ్లిసంగతి ఎత్తుతే

"చదువు పూర్తికానీ - తర్వాత ఆలోచిద్దాం" అని జవాబిస్తాడు. అయినా చదువుకి పెండ్లికి సంబంధ మేమిటి? అతను చదువుకొంటూ నంటే సుగుణ వద్దంటుందా, కాదంటుందా? సుగుణని అతను పెళ్ళాడుతే, వాళ్ళిద్దరు చిలకా గోరువంకల్లా కాపురం చేస్తూ ఉంటే, చూచి సంతోషిద్దామని తవింతకాలం సమయంకోసం వేచి కూర్చుంది. 'తర్వాత ఆలోచిద్దాం' అని అతననగానే తన గుండెలో రాయిపడింది. తన ఆశలన్నీ కూల్చే కాదే అని విచారిస్తోందిప్పుడు. ఆమెస్థితి చూస్తే నా ప్రకాశం తన మనసు మార్చుకొని సుగుణని పెండ్లాడితే బాగుండును అని అనుకుంటారు అమ్మలక్కలు.

బావ తన అభిప్రాయాల్ని ఎవరికీ తెలియనీయకుండా ఎన్నాళ్ళట్లా గుట్టుగా ఉంచుతాడు. జులాయిగా తిరిగి చెడిపోతాడేమో? బావతో మాట్లాడుతున్నంతసేపూ తను ఏస్వర్గసీమలోనో విహరిస్తున్నట్లుగా ఉంటుంది. బావను చూస్తూ కూర్చుంటే తనకిక అన్నపానీయాలవసరం లేదు. గ్లాస్కో పంచెకట్టి ఆలాల్చీ తొడుక్కుంటే అచ్చంబెంగాలీ బాబులా ఉంటాడు, అందమైన మొహం దానికి తోడు ఆవంకెలుతిరిగిన జుట్టు నిజంగా బావను చూస్తుంటే అలాంటి సుందరుడు తనని పెళ్ళాడుతాడా అనేసందేహం కల్గుతోంది సుగుణకు.

బావకి తనునచ్చ లేదుకాబోలు అందుకనే దూరంగా, సంబంధం లేనట్లుగా ఉంటాడు. తను నోరుతెరిచి 'నన్ను పెండ్లిచేసుకోవా' అనిఅడుగుతేకాదంటాడా? అయినా తనేలా అడగ్గలదు? బావలాట విశాల భావాలు గలయువకుడు తనకు పతిగాలభిస్తే తనింక కోరతగ్గదేముంది ఏదేమైనా తన ననుగ్రహించి బావని తనకు భర్తగా ప్రసాదిస్తే, అతనికి కావలసిన దివ్యానుభూతి అందించగలదు. తనూ పొందగలదు. తత్ఫలితంగా జ్ఞాపక చిహ్నంగా ఓపాప ఉదయిస్తే తను ముద్దలాడవచ్చు అని ఆలోచిస్తూ, తన్మయత్వం చెందుతూ అమ్మదగ్గరికి చేరింది సుగుణ.

"ఇంత సేపటిదాకా ఏం చేస్తున్నావే" అంది శాంతమ్మ. "వసారాలో కూర్చున్నా" అంది సుగుణ చతికిల బడుతూ. వాళ్ళిద్దరి మధ్య ఒక అయిదు నిముషాలు నిశ్శబ్దంగా కాలం గడిచింది.

"అమ్మాయ్ బావను పిలు భోంచేద్దురుగాని" అంది శాంతమ్మ నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ. సుగుణ లేచివెళ్ళి బావను పిల్చుకొచ్చింది.

ఈలోగా శాంతమ్మకి ఒక చక్కని ఉపాయం తోచింది. ఈదెబ్బతో తన కూతురి పెళ్ళి నిర్విఘ్నంగా సాగి పోతుందని ప్రకాశం లొంగి పోతాడని అనుకొంది. ఆమెలో నూతనోత్సాహం ఉద్రేకం కలిగాయ్. మూడేళ్ళయింది. తన భర్త చనిపోయి. ఆయన ఉన్ననాళ్ళు తనకొక్కక్షణం తీరిగ్గా ఉండనిచ్చేవాడా? ఎప్పుడూ కొంగట్టుకు తిరుగుతూ "శాంతా" "శాంతా" అని కలవరించే వారు. తనుమాత్రం - ఆయనెప్పుడు ఆఫీసునుంచి వస్తాడా, చిరునవ్వుతో, సింగారింపుతో ఆయన కెప్పుడు స్వాగతం చెబుదామా అని కూర్చుండేది. కొంచం ఆయన వచ్చేవేళ దాటితే తనెంతో యదిగా పరితపించేది గడచిన మధుర స్మృతుల్ని జ్ఞప్తికితెచ్చుకొని ఆనందంతో ఓలలాడుతోంది శాంతమ్మ.

"అమ్మా అన్నంపెట్టవే" అని సుగుణ పిలిచే దాకా తనీలోకంలోలేదు ఆలోచనలకు స్వస్తిచెప్పి వడ్డన ప్రారంభించింది. ఆనాడు ప్రకాశరావును చూస్తే తనకెందుకో సిగ్గేసింది. అయినా అతన్ని చూసి సిగ్గుపడవలసిన అవసరమేముంది గనక. అసిధైర్యాన్ని ఉగ్గపట్టుకొని కావలసినవి కనుక్కొని వడ్డిస్తోంది శాంతమ్మ. సుగుణ మాత్రం దిక్కులుచూస్తూ, మధ్య మధ్య బావని చూసి ముసిముసి నవ్వులు నవ్వుతూ భోంచేస్తోంది. ప్రకాశాన్ని తేరిపారచూచి తన సుగుణకి అతనే తగిన వరుడని ఒకనిర్ణయాని కొచ్చేసింది శాంతమ్మ.

"సినిమాకు వెళ్తున్నా అత్తయ్యా" అన్నాడు ప్రకాశం "నేనూ వస్తాబావా" అంది సుగుణ తల్లి వంకచూస్తో. కాంతమ్మ సుగుణకేసి చురచుర చూస్తో "అర్ధరాత్రివేళ నువ్వుకూడా దేనికి అతని వెంట ఈసారి ఎప్పుడైనా నిన్ను తీసుకెళ్తాడులే. అతన్ని వెళ్ళనీ" అంది. ఆమెమాటలు ప్రకాశానికి ఆశ్చర్యాన్ని కల్గించినాయ్. తనెప్పుడు పిక్చరుకు వెళ్దామనుకున్నా సుగుణని వెంటతీసుకు పొమ్మని బలవంతంచేసే కాంతమ్మత్తయ్య ఇవాళ తన కూతుర్ని వద్దని వారిస్తోందేమిటా అని ఆలోచిస్తూ వెళ్ళిపోయాడు ప్రకాశం.

అల్లుడు వెళ్ళిన అయిదునిముషాల్లో తనూ ఎంగిలిపడి, ఇల్లుకడిగి తలుపులు జాగ్రత్తగావేసి మంచానికి చేరేసింది శరీరాన్ని. అతనొచ్చాక తను ఏంచేయ్యాలో స్మరణకు తెచ్చుకొంటోంది. గడచిన ఈ మూడేళ్ళు మూడుయుగాలుగా గడిపింది అవి తన దుఃఖదినాలు, ఈనాడో మరపురాని రాత్రి. ఒక్కరాత్రిలో ప్రకాశాన్ని చులాగ్గా బోల్తా కొట్టించి మూడోనాటికి సుగుణనిచ్చి పెండ్లిచేసేయ్యలేనా అని ఆలోచిస్తోంది కాంతమ్మ, అలాగే నిద్రపోయింది కూడా.

సరిగ్గా గడియారం ఒక గంటకొట్టింది. ఆమెకి అకస్మాత్తుగా మెలకువ వచ్చింది, కళ్ళుతెరిచి నాల్గువైపులా చూచింది అల్లుడు వచ్చిన అలికిడి అవుతుందేమోనని. ఇంతలో తలుపుకొట్టిన చప్పుడు వినిపించింది తనకి, లేచి వెళ్ళింది తలుపు తీయటానికి. ప్రకాశం మేడఎక్కిన అరగంటకి కూతురి, లేపిపంపిం..పైకి. చీకటిగదిలో పడుకున్న ప్రకాశాన్ని చూసేసరికి సుగుణ కెందుకో ఆనందంకల్గింది. తనకార్యసాధనకి అవాతావరణం అనుకూలమనుకొంది. ఆమెకీ విషయం జ్ఞప్తికి రాగానే ఆమెలో సంతోషం వెల్లివిరిసింది. చప్పుడు చేయకుండా వెళ్ళి అతన్ని లేపింది. అంతవరకు స్త్రీస్పర్శ ఎరుగని ప్రకాశం తనకేదో నూతనానుభూతి కలుగుతున్నట్లుగా భావించాడు.

నిద్రమత్తంతా వదలిపోయింది. "సుగుణా ఏమిలాగొచ్చావు?" అని అడిగాడు సుగుణ కిలకిల నవ్వింది. "ఏమిటర్రా చేస్తున్నారు?" అంటూ ప్రశ్నించింది కాంతమ్మగారు. ఆవిడ వెనకాతలే వచ్చింది! ప్రకాశం బిక్కచిక్కిపోయాడు "దిగూకిందకి ఇద్దరికీ మతులు పోతున్నాయి" అన్నది కాంతమ్మగారు. సుగుణ గునుస్తు దిగిపోయింది, ప్రకాశం తలదించుకు నిరుత్తరుడై పోయాడు. ఏమెందుకూ రేపే పౌరోహితుణ్ణిపిలిచి ముహూర్తం పెట్టిస్తా" అంది అతని మొహం లోకిచూస్తో, "నీయిష్టం" అన్నాడు ప్రకాశం. వారంరోజుల్లోనే సుగుణ, ప్రకాశంవులవివాహం స్థిరమైంది.

★

ఆనందవాణి
పోస్టుబాక్సు నెంబరు
1583
—మేనేజరు